హ్యుందాయ్ నయా అల్కజార్

ధరల శ్రేణి రూ.14.99-15.99 లక్షలు • సంస్థ అమ్మకాల్లో 67% ఎస్‌యూవీలవే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: హ్యుందాయ్ మోటర్ ఇండియా సోమవారం తమ సెవెన్ సీటర్ ఎస్‌యూవీ అల్కజార్ సరికొత్త వెర్షన్స్‌ను ఆవిష్కరించింది. పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో ఇవి లభిస్తాయి. ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం పెట్రోల్ వేరియంట్స్ ప్రారంభ ధర రూ.14.99 లక్షలుగా ఉన్నది. డీజిల్ వేరియంట్స్ ఆరంభ ధర రూ.15.99 లక్షలు.

కాగా, దేశంలో స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్స్ (ఎస్‌యూవీ) అమ్మకాలు క్రమేణా పెరుగుతున్నట్టు ఈ సందర్భంగా ఇక్కడ హ్యుందాయ్ మోటర్ ఇండియా ఎండీ ఉన్సూ కిమ్ విలేకరులకు తెలియజేశారు. ఈ క్రమంలోనే తమ సంస్థ అమ్మకాల్లో ఎస్‌యూవీల వాటానే 67 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇండస్ట్రీ సగటు 53 శాతమేనని గుర్తుచేశారు. మధ్యశ్రేణి ఎస్‌యూవీ క్రెటాకు కూడా మార్కెట్‌లో డిమాండ్ బాగానే ఉందని, ఇప్పటికే లక్ష యూనిట్ల అమ్మకాలు జరిగాయన్నారు. ఇక నయా అల్కజార్ కోసం సవరించిన ధరలు.. మరింతమంది కస్టమర్లను ఆకర్షిస్తాయన్న విశ్వాసాన్ని కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ వెలిబుచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ హ్యుందాయ్ అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నట్టు చెప్పారు. గతంలో సుమారు 17 శాతంగా ఉన్న సంస్థ వాటా.. ఇప్పుడు 21.3 శాతానికి పెరిగినట్టు వివరించారు. తమ కస్టమర్ల కోసం అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ (ఏడీఏఎస్)తో వాహనాలను మార్కెట్‌లోకి తెస్తున్నట్టు పేర్కొన్నారు.

బెంజ్ గిన్నిస్ మైలేజ్

ఒక్కసారి చార్జింగ్ చేస్తే 949 కి.మీ ప్రయాణం

గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకెక్కిన ఈక్యూఎస్ 580 4మ్యాటిక్ ఎలక్ట్రిక్ కారు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ సంచలనం సృష్టించింది. ఈ సంస్థ రూపొందించిన ఈక్యూఎస్ 580 4మ్యాటిక్ ఎలక్ట్రిక్ సెడాన్ కారు గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకెక్కింది. కేవలం ఒక్కసారి చార్జింగ్ చేస్తే ఏకంగా 949 కిలోమీటర్లు ప్రయాణించింది మరి. సింగిల్ చార్జ్‌తో ఇంత దూరం పరుగులుపెట్టిన బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికిల్ (బీఈవీ) ఇదేనని గిన్నిస్ బుక్ వర్గాలు తేల్చాయి. బెంగళూరు నుంచి దేవన్‌గెరె, హూబ్లీ, బెల్గావీ, కొల్హాపూర్, సతారా, పుణెల మీదుగా నవీ ముంబైకి చేరింది. మార్గ మధ్యంలో భారీ వర్షాలు, ట్రాఫిక్, రోడ్డు పనులు, డైవర్షన్లున్నా ఎలాంటి సమస్యల్లేకుండా ప్రయాణం సాగినట్టు కంపెనీ పేర్కొన్నది. ప్రతీ 100 కిలోమీటర్లకు 11.36 కిలోవాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్టు స్పష్టం చేసింది. కాగా, మహారాష్ట్రలోని పుణె సమీపంలోగల చకాన్ ప్లాంట్‌లోనే ఈ కార్లు తయారవుతున్నాయి. హైదరాబాద్‌లో ఈ కారు ధర రూ.1.95 కోట్లుగా ఉన్నది. ఇక ఈ 'మేడ్ ఇన్ ఇండియా' ఈక్యూఎస్ సెడాన్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను గెల్చుకోవడం పట్ల మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ రికార్డును సాధించడం వెనకున్న ఆటోకార్ ఇండియా బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఫిట్‌డేలో మహేశ్ బాబు పెట్టుబడి

హైదరాబాద్, సెప్టెంబర్ 9: ఆరోగ్యకరమైన చిరుతిండి పదార్థాల తయారీ సంస్థ ఫిట్‌డేలో తెలుగు సూపర్‌స్టార్ మహేశ్ బాబుకు చెందిన జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ పెట్టుబడులు పెట్టింది. ఆర్థిక వివరాలు మాత్రం వెల్లడించలేదు. వ్యూహాత్మక పెట్టుబడుల్లో భాగంగా ఫిట్‌డే మరో మైలురాయికి చేరుకోనున్నదని, తాజాగా మహేశ్ బాబు పెట్టుబడులు పెట్టడం ఆయనకు ధన్యవాదములని కంపెనీ ఫౌండర్, సీఈవో సురేశ్ రాజు తెలిపారు. ఇప్పటికే చాలా పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని, కానీ సరైన అవకాశాలు, తమ విజన్‌కు తగ్గట్టుగా ఉన్నవారి నుంచి మాత్రమే పెట్టుబడులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కంపెనీ తన వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనుకుంటున్నదని, ముఖ్యంగా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్లు, కార్పొరేట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు.

20 లక్షల కోట్లు దాటిన ఆటో ఇండస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: దేశీయ ఆటోమొబైల్ రంగం టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలోనే ఆటోమొబైల్ ఇండస్ట్రీ రూ.20 లక్షల కోటు దాటిందని, మొత్తం జీఎస్టీ వసూళ్లలో 14-15 శాతం వాటా ఈ రంగానిదేనని సియామ్ ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ తెలిపారు.

బీమాపై జీఎస్టీ ఎత్తివేత?

నవంబర్‌లో కౌన్సిల్ నిర్ణయం.. మంత్రుల కమిటీ ఏర్పాటు

క్యాన్సర్ ఔషధాలు, నమ్‌కీన్స్‌పై ట్యాక్స్ తగ్గింపు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై 18 శాతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేటు ఎత్తివేత/తగ్గింపు దిశగా అడుగులు పడ్డాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ మండలి సోమవారం నిర్వహించిన 54వ సమావేశంలో సాధ్యాసాధ్యాలపై ఓ కమిటీని వేయాలని నిర్ణయించింది. బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి అధ్యక్షతన ఈ మంత్రులతో కూడిన కమిటీ ఉంటుంది. వచ్చే నెలాఖర్లోగా ఈ కమిటీ తమ నివేదికను సమర్పించనున్నది. నవంబర్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

5 శాతమే పన్ను

క్యాన్సర్ ఔషధాలు, వివిధ రకాల మిక్చర్ (నమ్‌కీన్స్)పై జీఎస్టీని తగ్గిస్తూ తాజా భేటీలో జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు వాడే మందులపై ప్రస్తుతం పడుతున్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. ఇంతకుముందు ఇది 12 శాతంగా ఉన్నది. అలాగే నమ్‌కీన్స్‌పై జీఎస్టీని కూడా 18 శాతం నుంచి 12 శాతానికి తెచ్చారు. ఇదిలావుంటే 2026 మార్చి తర్వాత ముగిసిపోనున్న నష్ట పరిహార సెస్సుకు సంబంధించి వస్తున్న ఆందోళనల పరిష్కారానికీ ఓ మంత్రుల కమిటీని ఏర్పాటు చేస్తామని నిర్మలా సీతారామన్ చెప్తున్నారు. అలాగే జీఎస్టీ రేటు హేతుబద్ధం, ఆన్‌లైన్ గేమింగ్‌పై మంత్రుల కమిటీ నివేదికలపైనా చర్చించారు. అయితే ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం జీఎస్టీ విధించిన దగ్గర్నుంచి పన్ను వసూళ్లు 412 శాతం పెరిగినట్టు మంత్రి సీతారామన్ చెప్పారు. నిరుడు అక్టోబర్ 1న ఈ పన్ను వేసిన విషయం తెలిసిందే.

మరికొన్నింటిపై..

తీర్థయాత్రలకు వినియోగించే హెలికాప్టర్ సర్వీసులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించినట్టు ఉత్తరాఖండ్ ఆర్థిక మంత్రి ప్రేమ్ చంద్ అగర్వాల్ తెలిపారు. ఇంతకుముందు ఇది 18 శాతంగా ఉండేది. మరోవైపు పరిశోధనల కోసం మంజూరు చేసే నిధులపై జీఎస్టీని ఎత్తివేసినట్టు ఢిల్లీ ఆర్థిక మంత్రి అతిషి తెలిపారు. ఇక విదేశీ విమాన యాన సంస్థల ఆధ్వర్యంలో నడిచే కంపెనీల ద్వారా జరిగే దిగుమతి సర్వీసులపైనా జీఎస్టీని ఎత్తివేయాలని నిర్ణయించినట్టు రెవిన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా వెల్లడించారు.

ఐఫోన్ 16 వచ్చేసింది..

కాలిఫోర్నియా, సెప్టెంబర్ 9: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐఫోన్ ప్రియులకు శుభవార్తను అందించింది యాపిల్ సంస్థ. తన తదుపరి మాడల్ ఐఫోన్ 16ను మార్కెట్లోకి విడుదల చేసింది. కాలిఫోర్నియాలోని యాపిల్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఒకేసారి ఐఫోన్16తోపాటు యాపిల్ వాచ్ ఎక్స్, ఎయిర్‌బడ్స్, హెడ్‌ఫోన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఐదు రంగుల్లో లభించనున్న ఐఫోన్ 16, ఐఫోన్ 16 ప్లస్ మాడళ్లను ఆవిష్కరించింది. వచ్చేవారంలో దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి రానున్న ఈఫోన్లు రూ.65 వేల ప్రారంభ ధర కాగా, గరిష్ఠంగా రూ.74 వేల స్థాయిలో లభించనున్నది.

వాచ్: సిరీస్ 9, 10లను అందుబాటులోకి తీసుకొచ్చింది. మూడు రంగుల్లో లభించనున్న ఈ వాచ్‌లో వాతావరణం, రైళ్ల సమాచారం కూడా పొందవచ్చును.

- 6.1 ఇంచులు, 6.7 ఇంచుల స్క్రీన్‌తో తయారు చేసింది.
- 3,561 ఎంఏహెచ్ బ్యాటరీతో..
- 48 మెగాపిక్సెల్ ఫ్యూజన్ కెమెరా, 24 మెగాపిక్సెల్, 12 మెగాపిక్సెల్ కెమెరాలు..
- యాపిల్ ఏ18 చిప్‌సెట్, ఏఐతో పనిచేయనున్నది.
- లైవ్ వీడియోల షేరింగ్
- వీటిలో ఐఫోన్ 16 ధర 799 డాలర్లు(రూ.65 వేలు), కాగా ఐఫోన్ 16 ప్లస్ 899 డాలర్లు(రూ.74 వేలు)

ఎల్ఐసీ ప్రీమియం వసూళ్లు 19 వేల కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ రికార్డు స్థాయి ప్రీమియం వసూళ్లు సాధించింది. గత నెలలో ఏకంగా రూ.19,309.10 కోట్ల నూతన బిజినెస్ ప్రీమియం వసూలైనట్లు తెలిపింది. నిరుడు ఆగస్టులో రూ.14,292.53 కోట్లే. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో రూ.95,180.63 కోట్ల నూతన బిజినెస్ ప్రీమియం వసూలైనట్లు వెల్లడించింది. మరోవైపు, గత నెలలో పాలసీల జారీ ఏడాది ప్రాతిపదికన 4.45 శాతం తగ్గి 17.12 లక్షల నుంచి 16.36 లక్షలకు తగ్గాయని తెలిపింది.

లైఫ్ ఇన్సూరెన్స్‌లో 22 శాతం వృద్ధి

గత నెలలో జీవిత బీమా నూతన ప్రీమియం వసూళ్లు ఏడాది ప్రాతిపదికన 22 శాతం అధికమై రూ.32,644 కోట్లకు చేరుకున్నాయి. అలాగే నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లు తొలి ఐదు నెలల్లో 21 శాతం పెరిగి రూ.1,54,194 కోట్లకు చేరాయి.

దిగొచ్చిన పసిడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: దేశీయంగా బంగారం ధరలు దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.700 తగ్గి రూ.73,500కి దిగింది. అంతకుముందు ధర రూ.74, 200గా ఉన్నది. వెండి ధర కిలో రూ.2,000 తగ్గి రూ.83,800కి దిగొచ్చినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,522.90 డాలర్లు, వెండి 28.44 డాలర్ల వద్ద ఉన్నాయి.

భారత తొలి డాలర్ ట్రిలియనీర్ అదానీయే!

- ఓ తాజా నివేదిక అంచనా
- ప్రపంచంలో మస్క్‌దే ఆ ఘనత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: భారతీయ సంపన్నులలో తొలి డాలర్ ట్రిలియనీర్ రికార్డును అందుకునేది అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీయేనని ఓ తాజా నివేదిక అంచనా. 2028కల్లా అదానీ సంపద ట్రిలియన్ డాలర్లను తాకుతుందని ఇన్వార్మా కనెక్ట్ అకాడమీ రిపోర్టు చెప్తున్నది. అదానీ వార్షిక సంపద సగటు వృద్ధిరేటు ప్రస్తుతమున్న 123 శాతం అలాగే కొనసాగితే అది సాధ్యమేనంటున్నది. అయితే ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ ఈ ఫీట్‌ను అందుకోవడానికి 2033 కావచ్చనడం గమనార్హం. బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం ఇప్పుడు అంబానీ సంపద విలువ 111 బిలియన్ డాలర్లు. అదానీ సంపద 99.6 బిలియన్ డాలర్లే. మరోవైపు ప్రపంచంలో తొలి డాలర్ ట్రిలియనీర్ ఘనతను సాధించేది టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్కేనని ఈ రిపోర్టు చెప్పింది. 2027కల్లా మస్క్ ఈ రికార్డును సొంతం చేసుకోవచ్చన్నది. మస్క్ సంపద 237 బిలియన్ డాలర్లుగా ఉన్నదిప్పుడు. 110 శాతం వార్షిక వృద్ధి నమోదవుతున్నది.

ఓ కేసులో కస్టడీలో ఉంటూ వేరొక కేసులో ముందస్తు బెయిలు కోరొచ్చు

సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: ఓ కేసులో కస్టడీలో ఉన్న నిందితుడు వేరొక కేసులో ముందస్తు బెయిలును కోరవచ్చునని సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. ఆ రెండో కేసులో అరెస్ట్ కానంత వరకు ఆయనకు ఈ హక్కు ఉంటుందని చెప్పింది. ఇటువంటి ముందస్తు బెయిలు దరఖాస్తుపై తీర్పు చెప్పకుండా సెషన్స్ కోర్టు లేదా హైకోర్టులను నిషేధించే ప్రత్యక్ష లేదా పరోక్ష నిబంధన ఏదీ చట్టంలో లేదని వివరించింది. స్వేచ్ఛాయుతమైన, ప్రజాస్వామిక దేశంలో వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు గల ప్రాధాన్యాన్ని గుర్తించేందుకే సెక్షన్ 438ను సీఆర్‌పీసీలో చేర్చారని తెలిపింది. తనను అరెస్ట్ చేస్తారేమోనని భావిస్తున్న వ్యక్తికి బెయిలు మంజూరు చేయడానికి ఈ సెక్షన్ దోహదపడుతుందని చెప్పింది.

భారత్‌కు హిల్సా చేపల ఎగుమతిపై బంగ్లా నిషేధం

కోల్‌కతా, సెప్టెంబర్ 9: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనాకు భారతదేశం ఆశ్రయం ఇవ్వడంపై ఆగ్రహంతో ఉన్న బంగ్లాదేశ్ భారతీయుల 'జిహ్వ'పై దెబ్బ కొట్టింది. దుర్గాష్టమి వేడుకలకు ముందు వారు ఎంతో ప్రీతిగా ఆరగించే రుచికరమైన 'హిల్సా' చేపలను వారి నోటికి దూరం చేసింది. సాధారణంగా భారత్‌లోని చేపల కన్నా రుచికరమైనవిగా పేరొందిన ఈ హిల్సా చేపలు ప్రతి ఏడాది దుర్గాష్టమి వేడుకలకు ముందు బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు దిగుమతి అవుతాయి. ఈ పద్మ హిల్సా చేపలు గత ఏడాది బంగ్లా నుంచి 4,000 టన్నులు భారత్‌కు దిగుమతి అయ్యాయి. అయితే ఈ ఏడాది వాటి ఎగుమతులపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో ఈ ఏడాది తమ వంట గదుల్లో హిల్సా ఘుమఘుమలు లేకుండానే దుర్గాష్టమి వేడుకలు జరుపుకోవాలని, జిహ్వ చాపల్యాన్ని చంపుకోవాల్సిందేనని బెంగాలీలు నిట్టూరుస్తున్నారు.

ఢిల్లీలో బాణసంచాపై నిషేధం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: రాబోయే శీతాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణలో భాగంగా ఢిల్లీ ప్రభుత్వం బాణసంచాపై నిషేధం విధించింది. బాణసంచా తయారీ, అమ్మకం, వినియోగంపై వచ్చే ఏడాది జనవరి 1 వరకు నిషేధం విధిస్తూ ఢిల్లీ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిషేధం ఆన్‌లైన్ అమ్మకాలు, డెలివరీపై కూడా కొనసాగుతుందని పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ తెలిపారు. ఢిల్లీ పోలీస్, ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని, దీని కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని ఆయన చెప్పారు.

ఆ రెండు వర్సిటీలకూ ఇన్‌చార్జీ వీసీలే!

- చాన్స్‌లర్ లేకపోవడంతో ఆర్జీయూకేటీ వీసీ నియామకానికి అడ్డు
- మహిళా వర్సిటీకి ఇంతవరకూ యాక్ట్‌ను రూపొందించని సర్కారు

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్లను ఇప్పట్లో నియమించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో మరికొంత కాలం ఇన్‌చార్జీ వీసీలే కొనసాగనున్నారు. వీటిలో ఒక యూనివర్సిటీకి వర్సిటీ యాక్ట్‌ను రూపొందించకపోవడం, మరో విశ్వవిద్యాలయానికి చాన్స్‌లర్‌ను నియమించకపోవడంతో రెగ్యులర్ వీసీల నియామకానికి ప్రతిబంధంగా మారింది. బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ), కోఠిలోని తెలంగాణ మహిళా యూనివర్సిటీలు ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. బాసర ఆర్జీయూకేటీకి రెగ్యులర్ వీసీని నియమించాలన్న ప్రధాన డిమాండ్‌తో అక్కడి విద్యార్థులు వారం రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలంటే, తొలుత చాన్స్‌లర్‌ను నియమించాల్సి ఉంటుంది. గత బీఆర్ఎస్ సర్కారు ఈ వర్సిటీ యాక్ట్‌ను మార్చేందుకు ప్రయత్నించినా, అప్పట్లో ముందడుగు పడలేదు. అంతలో రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరింది. పాత యాక్ట్ ప్రకారం తొలుత ఆర్జీయూకేటీకి చాన్స్‌లర్‌ను నియమించాలి. వర్సిటీ యాక్ట్‌ను మారిస్తే గవర్నర్‌ను చాన్స్‌లర్‌గా నియమించాల్సి ఉంటుంది. ఈ రెండింటిపై సర్కారు ఎలా ముందుకెళ్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ పాత యాక్ట్ ప్రకారం ముందుకెళ్తే చాన్స్‌లర్‌ను నియమించిన తర్వాత గవర్నింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, సెర్చ్ కమిటీ ద్వారా కొత్త వీసీని నియమించాల్సి ఉంటుంది. కోఠి మహిళా కళాశాలను గత బీఆర్ఎస్ సర్కారు తెలంగాణ మహిళావర్సిటీగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ వర్సిటీకి ఇప్పటివరకు యూనివర్సిటీ యాక్ట్‌ను రూపొందించలేదు. తొలుత ఈ యాక్ట్‌ను ప్రభుత్వం రూపొందించాలి. దానిని అసెంబ్లీలో ఆమోదించి, గవర్నర్ ఆమోదానికి పంపించాలి. గవర్నర్ ఆమోదించిన తర్వాత వర్సిటీ యాక్ట్ అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత పాలకమండలిని నియమించి సెర్చ్ కమిటీ ద్వారా కొత్త వీసీని నియమించాలి. ఇదంతా పూర్తి కావడానికి మరికొంత సమయం పడుతుంది.

కాకతీయకు మోక్షం

రాష్ట్రంలో తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను ఎంపికచేసేందుకు సెర్చ్ కమిటీలను గతంలోనే ఏర్పాటు చేయగా, కాకతీయ వర్సిటీకి మాత్రం అప్పట్లో సెర్చ్ కమిటీని వేయలేదు. ఈ యూనివర్సిటీ పాలకమండలి గడువు ముగియడంతో పాలకమండలి నామినీ లేకపోవడంతో సెర్చ్ కమిటీని నియమించలేదు. ఇటీవలే ప్రభుత్వం ఈ వర్సిటీకి కొత్త పాలకమండలిని నియమించింది. కొత్త వీసీ నియామకం దృష్ట్యా సెర్చ్ కమిటీ ఏర్పాటు కోసం ఇటీవలే పాలకమండలి సమావేశాన్ని నిర్వహించి పాలకమండలి నామినిని సైతం ఎంపికచేశారు. సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తూ సర్కారు జీవోను జారీ చేయాల్సి ఉన్నది. ఇందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం సీఎస్ శాంతికుమారి వద్దకు వెళ్లింది. ఈ వారంలోనే తొమ్మిది విశ్వవిద్యాలయాలతోపాటు కాకతీయ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశాన్ని సైతం నిర్వహించే అవకాశాలున్నాయి. తొమ్మిది యూనివర్సిటీల వీసీల నియామకాల కోసం ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలు వారం పది రోజుల్లో సమావేశం కానున్నాయి.

ఏఈవోల అరిగోస..!

- అన్ని బాధ్యతలు వారిపైనే
- 4 నెలలుగా క్షణం తీరికలేకుండా వ్యవసాయ విస్తరణ అధికారులు
- పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓలు)పనిభారంతో ఇబ్బంది పడుతున్నారు. మూడు, నాలుగు నెలలుగా క్షణం తీరిక లేకుండా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక పని పూర్తికాక ముందే, మరో పని అప్పగిస్తుండడంతో ఏ పనిచేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. రుణమాఫీతో మొదలైన వీరి కష్టాలు పంటనష్టం సర్వే వరకు కొనసాగుతూనే ఉన్నాయి. రుణమాఫీ మొత్తం గందరగోళం కావడంతో క్షేత్రస్థాయిలో ఏఈవోలు తీవ్ర సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. రైతులకు నేరుగా అందుబాటులో ఉండడంతో రుణమాఫీ కాని రైతులు ఏఈవోలను నిలదీస్తున్నారు. ఇటు రుణమాఫీ గొడవ నడుస్తుండగానే, మరోవైపు పంటల సాగు నమోదు చేయాల్సిన బాధ్యత కూడా వాళ్లపైనే పడడంతో వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాని రైతు కుటుంబాలను నిర్ధారించే బాధ్యతను కూడా ప్రభుత్వం వీరికే అప్పగించింది. దీంతో ఏఈవోలు రైతుల ఇండ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. తాజాగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ఏఈవోల కష్టాలను మరింత పెంచాయి. భారీ వర్షాలకు పంటలు నీట మునగడం, కొట్టుకుపోవడంతో నష్ట పరిహారం కోసం సర్వే చేయాల్సి ఉంది. ఈ బాధ్యతను కూడా అధికారులు ఏఈవోలపైనే పెట్టారు. పని భారం తగ్గించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇరిగేషన్ శాఖలో త్వరలో ఈఎన్సీలు, సీఈలు

- వారంలోగా నియామక ప్రక్రియ
- సాగునీటి పారుదలశాఖ ముమ్మర కసరత్తు
- 687 మంది కొత్త ఏఈలకూ పోస్టింగ్ ఆర్డర్లు

హైదరాబాద్, సెప్టెంబర్9 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల శాఖలో ఖాళీగా ఈఎన్సీ, సీఈ పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నారు. వారంలోగా ఖాళీపోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేయాలని ఇటీవలే రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆ దిశగా ఉన్నతాధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఖాళీగా ఈఎన్సీ రామగుండం, ఈఎన్సీ జనరల్, ఈఎన్సీ ఓఅండ్‌ఎం పోస్టులను రెగ్యులర్ అధికారులతో భర్తీ చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. సూపర్ న్యూమరరీ పోస్టుగా మరో ఈఎన్సీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. ఈ శాఖలో మొత్తం 29 సీఈ పోస్టులకు గాను ప్రస్తుతం 16 మందే రెగ్యులర్ సీఈలు ఉన్నారు. మిగతా పోస్టుల్లో ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. ఎస్ఈ, ఈఈ పోస్టులకూ జాబితాలను సిద్ధం చేసినట్టు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల ఇరిగేషన్ శాఖలో కొత్తగా నియమితులైన 687 మంది ఏఈలకు వారం రోజుల్లోనే పోస్టింగ్ ఆర్డర్లను ఇచ్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకే కేన్స్ పరిమితం

తెలంగాణలో ఈఎంఎస్ తయారీ కేంద్రం

గుజరాత్‌కే సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమ • కేన్స్ సీఈవో రఘు పనిక్కర్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ): తెలంగాణలో కేన్స్ సెమీ కండక్టర్ల ఓఎస్ఏటీ (ఔట్ సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్)కి తయారీ పరిశ్రమ లేనట్టేనని తేలిపోయింది. దానికి బదులు అధునాతన ఈఎంఎస్ (ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సర్వీసెస్) తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కేన్స్ సీఈవో రఘు పనిక్కర్ స్పష్టంచేశారు. తాజాగా 'డిజిటైమ్స్ ఏషియా' పత్రికతో ఆయన మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. పెట్టుబడి స్వభావం మారిందని, ఈ మేరకు ఈఎంఎస్ తయారీ మొదటి దశను ఇప్పటికే ప్రారంభించినట్టు పనిక్కర్ చెప్పారు. కొంగరకలాన్ ప్లాంట్‌లో 3,000 మందికి ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇండియన్ సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)లో భాగంగా దేశంలో ఒకే ప్రాంతంలో సెమీ కండక్టర్ల ఎకోసిస్టంను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందని, ఇందులో భాగంగా టాటా, మైక్రాన్ వంటి కంపెనీలు గుజరాత్‌లోనే సెమీ కండక్టర్ల ప్లాంట్లను నెలకొల్పాయని చెప్పారు. ఇదే వరుసలో తాము కూడా గుజరాత్‌లో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నట్టు తేల్చిచెప్పారు.

నాడు 'కేన్స్'ను ఒప్పించిన బీఆర్ఎస్ సర్కార్

చైనా, తైవాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు నేడు సెమీ కండక్టర్ల రంగంలో ఎంతో రాణిస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మన దేశంలో సెమీ కండక్టర్లకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. ఆ మేరకు మన రాష్ట్రంలో సెమీ కండక్టర్లు తయారు చేసే విధంగా ఆనాడే కేన్స్ కంపెనీని ఒప్పించింది. వారు అడిగిందే తడవుగా కొంగరకలాన్‌లో భూములు కూడా కేటాయించింది. సెమీ కండక్టర్ల ఓఎస్ఏటీ